## క్లుప్తంగా

### 21న చిత్తూరుకు తరలి రండి

పుంగనూరు: ఎంఆర్‌పీఎస్ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21న చిత్తూరుకు వస్తున్న ఉప కులాల ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రాను కలిసేందుకు చిత్తూరుకు తరలి రావాలని స్థానిక ఎంఆర్‌పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అధ్యక్షుడు నరసింహులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. నరసింహులు మాట్లాడుతూ ఉప కులాల కమిషన్‌కు తమ 30 ఏళ్ల పోరాటాన్ని వివరించేందుకు ఎంఆర్‌పీఎస్ కుటుంబసభ్యులు అందరూ తరలి రావాలన్నారు. దీని ద్వారా విభజన కార్యక్రమం విజయవంతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంఆర్‌పీఎస్ నేతలు పాల్గొన్నారు.

### వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి


రక్తదానం చేస్తున్న యువత

పుంగనూరు: స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని హోమియో డాక్టర్ సరళ పిలుపునిచ్చారు. స్థానిక బీఎంఎస్ క్లబ్‌లో ఆదివారం వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువకులు అధిక సంఖ్యలో హాజరై రక్తదానం చేశారు.

### కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు


సీఐ సోమశేఖర్‌రెడ్డి

వి.కోట: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలో ఎక్కడైనా కోడి పందేలు, ఇతర జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ సోమశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కోడి పందేలు ఆడడం చట్టరీత్యా నేరమన్నారు. కోడి పందేలు, పేకాట నిర్వహించడం పూర్తిగా నిషేధమని ఎవరైనా ఈ క్రియాకలాపాలకు పాల్పడినా, ప్రోత్సహించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ తెలిపారు.

### జూదం ఆడితే జైలుకే!


సీఐ శ్రీనివాసులు

పుంగనూరు: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎలాంటి జూదాలు ఎవరు ఆడినా జైలుకేనని సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ పర్యవేక్షణలో అన్ని గ్రామాల్లోనూ జూదాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల పేరుతో అశ్లీల కార్యక్రమాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి, అరెస్ట్ చేస్తామన్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాల నిర్మూలనకు ప్రజలు సహకరించాలని కోరారు.

### పోలీసులకు బకాయిల చెల్లింపుపై హర్షం

చిత్తూరు అర్బన్: పోలీసు ఉద్యోగుల అడిషనల్ సరెండర్ లీవు బకాయిల చెల్లింపుపై పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఉదయ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. 2024 జనవరి నెల నుంచి జూన్ వరకు సరెండర్ లీవు బిల్లులు, జీపీఎఫ్, సీపీఎ ఉద్యోగుల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఈ బకాయిలను వెంటనే మంజూరు చేసేలా ఆదేశాలు జారీ చేయడం ఆనందకరమని ఆయన పేర్కొన్నారు.

# తల్లిదండ్రులకు భరోసా!

- పిల్లలు చూడకుంటే రాసిన ఆస్తిని వెనక్కి తీసుకోవచ్చు
- ఆస్తుల రిజిస్ట్రేషన్లు రద్దు చేసుకోవచ్చు
- సబ్ రిజిస్ట్రార్లకు ఆదేశాలు



పలమనేరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం (ఇన్‌సెట్) అధికారుల చుట్టూ తిరుగుతున్న గోపాల్ రెడ్డి

పలమనేరు: పలమనేరు నియోజకవర్గం వి.కోట మండలం ఆరిమాకులపల్లికి చెందిన ఏసీ గోపాల్‌రెడ్డి(74) గతేడాది తన పిల్లలను తనను పట్టించుకోడం లేదని స్థానిక ఆర్డీఓను ఆశ్రయించాడు. గోపాల్ రెడ్డి భార్య, ఇద్దరు కుమారులు ఇరవై ఏళ్ల క్రితం తండ్రిని వదిలి బెంగళూరుకు వెళ్లిపోయారు. దీంతో గ్రామంలో ఉన్న భూమిని బిడ్డలకు గతంలో పిల్లల పేరిట రాసి పంపకాలు చేశాడు. దీంతో వారు తండ్రిని అసలు పట్టించుకోలేదు. తన పేరిట ఉన్న ఎకరా పొలాన్ని కౌలుకిచ్చి బతుకునీడ్చుకుంటూ వచ్చాడు. రెండేళ్లప్పుడు కంటి ఆపరేషన్ వికటించి కన్ను కనిపించకుండా పోయింది. అప్పటి నుంచి ఏమి పని చేసుకోలేక నిస్సాయస్థితిలో వి.కోటలో ఓ అద్దెగదిలో ఉంటున్నాడు. బిడ్డలను పెంచి పెద్దచేసి ఉన్న ఆస్తిని వారికి ఇచ్చి సంరక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. కుమారులు తనను సంరక్షించని కారణంగా ఎవరైనా సరే తనను వృద్ధాప్యంలో చూసుకుంటే వారికి తన ఎకరా భూమిని రాసిస్తానంటూ లిఖితపూర్వకంగా అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయింది. గోపాల్‌రెడ్డిలాగా వృద్ధాప్యంలో బిడ్డలు చూడకుండా బతకు భారమైన భోజనానికి సైతం ఇబ్బందులు పడుతున్న ఎందరో ముసలి తల్లిదండ్రులు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలువురున్నారు. ఇలాంటి వారికి భరోసానిస్తూ ప్రభుత్వం కొత్త చట్టాన్ని తెచ్చింది. పిల్లలకు రాసిచ్చిన ఆస్తిని తల్లిదండ్రులు వెనక్కి తీసుకునే వెసులుబాటు కల్పించింది.

**రిజిస్ట్రేషన్లను రద్దు చేసుకోవచ్చు..**

తల్లిదండ్రులు పిల్లలకు దాన విక్రయం(గిఫ్ట్ డీడ్), సెటిల్‌మెంట్ డీడ్‌లను తమ సంరక్షణ కోసం ఇకపై రద్దు చేసుకోవచ్చు. ఇలాంటి బాధలు పడుతున్న తల్లిదండ్రులు ఆయా పరిధిలో ట్రిబ్యునల్ అధికారిగా ఉన్న ఆర్డీఓను ఆశ్రయించాల్సి ఉంటుంది. ఆపై ఆర్డీఓ ఇచ్చే ఆదేశాల మేరకు సంబంధిం సబ్ రిజిస్ట్రార్లు రద్దు చేయాల్సి ఉంటుంది. దీంతో తల్లిదండ్రులు పట్టించుకోకుండా ఇలాంటి పరిస్థితి తప్పదని ఇకనైనా పిల్లలు బాగా చూసుకుంటారని ఈ చట్టం ఉద్దేశం. ఆమేరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ అండ్ ఐజీ శేషగిరిబాబు నుంచి తాజాగా జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్లకు ఆదేశాలందాయి.

**తల్లిదండ్రుల రక్షణకే సీనియర్ సిటిజన్స్ చట్టం..**

తల్లిదండ్రుల నుంచి ఆస్తిని రాయించుకున్నాక వారిని పిల్లలు పట్టించుకోకపోవడం, వారి జీవనం నిర్వహణ బాధ్యతను తీసుకోకపోవడంతో చాలా మంది ఇబ్బందులు పడుతుంటారు. ఇలాంటి వారికి రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం సీనియర్ సిటిజన్స్ చట్టాన్ని 2007 సంవత్సరంలో తీసుకొచ్చింది. ఇందుకు ట్రిబ్యునల్ అధికారిగా ఆర్డీఓలను నియమించింది. ఇప్పటిదాకా ఓ సారి పిల్లలకు రాసిచ్చిన ఆస్తిని రద్దు చేసే అధికారం రిజిస్ట్రేషన్ శాఖలో అస్పష్టంగా ఉండేది. తాజా ఆదేశాలతో ఇకపై ఎలాంటి డీడ్లను సైతం ట్రిబ్యునల్ అధికారి ఆదేశాలతో తల్లిదండ్రులు వెనక్కి తీసుకునే వెసులుబాటు లభించింది.



**ఇది మేలు చేసే చట్టం..**

సీనియర్ సివిల్ సిటిజన్ చట్టాన్ని మరింత దృఢం చేస్తూ పిల్లలకు రాసిచ్చిన ఆస్తిని వెనక్కి తీసుకోనేలా వచ్చిన ఆదేశాలు పోషణభారమైన వృద్ధులకు మేలు చేస్తాయి. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను గాలికొదిలేస్తే ఆస్తి పోతుందనే భయంతోనైనా ఇకపై పిల్లలు వారి తల్లిదండ్రులను బాగా చూసుకునే అవకాశం ఉంటుంది.

–సోమచంద్రారెడ్డి, మేధావుల ఫోరం జిల్లా అధ్యక్షుడు

### మకరజ్యోతి దర్శనం రేపు


అయ్యప్ప ఆలయం

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె కోటమలై అయ్యప్పస్వామి ఆలయంలో 14న మకరజ్యోతి దర్శనం నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబసభ్యులతో కలసి ఊరేగింపుగా అయ్యప్ప ఆలయానికి తిరు ఆభరణాలను తీసుకొస్తారు. వాటిని స్వామి వారికి అలంకరించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తారు. సాయంత్రం సమీపంలోని కొండల్లో మకరజ్యోతి దర్శనం ఇస్తుంది. జ్యోతి దర్శనం అనంతరం ఆలయంలో అఖండజ్యోతి, కర్పూర దీపాలు వెలిగిస్తారు. వీటిని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం ఏర్పడకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

### గాయపడిన వ్యక్తికి చేయూత

పుంగనూరు: పుంగనూరు మండలం ప్రసన్నయ్యగారిపల్లెలో రెండు రోజుల క్రితం కత్తిపోట్లకు గురైన సుబ్రమణ్యంకు వైద్యసేవల నిమిత్తం బలిజ సంఘం చేయూతనిచ్చింది. ఆదివారం సంఘ నాయకులు రమణ, కుమార్, భాస్కర్, రాఘవ, జనార్దన్, మోహన్, సురేష్, సుధీర్ కలసి బాధితుడి తల్లికి రూ.25 వేలు విరాళం అందజేశారు. బాధితుడికి అవసరమైతే సంఘం తరపున మరింత చేయూతనిస్తామని తెలిపారు.

## వధూవరులను ఆశీర్వదించిన పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి


నూతన వధువును ఆశీర్వదిస్తున్న పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి

రొంపిచెర్ల: నాగిరెడ్డి కల్యాణ మండపంలో నూతన వధూవరులను పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి ఆశీర్వదించారు. ఆదివారం రొంపిచెర్ల వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు ఎం.అహ్మద్‌అలీబేగ్ కుమార్తె వివాహ వేడుకలకు ఎమ్మెల్యే, ఎంపీ ఇద్దరు హాజరయ్యారు. నూతన వధూవరులు మొగల్ నగ్మా సుల్తానాబేగం, షేక్ మహ్మద్ ఉమర్ హసన్‌లను ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ నేతలు చెంచురెడ్డి, ఎల్.మహబూబ్ బాషా, ఎం.నిజాంఅలీబేగ్, ఇంతియాజ్‌ఖాన్, అల్లాబక్స్, బుడ్డా సాహెబ్, జాకీర్‌హుసేన్, హిమయ తుల్లాబేగ్, కరంతుల్లాబేగ్, పీలేరు సర్పంచ్ అబీబ్‌బాషా పాల్గొన్నారు.

### హక్కుల కోసం పోరాటం

పుంగనూరు: సమాజంలో బహుజనుల హక్కులను సాధించుకునేందుకు అవసరమైతే పోరాటం చేస్తామని బహుజన సంఘ నాయకులు తెలిపారు. ఆదివారం పట్టణంలో బహుజనుల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకుడు కృష్ణమూర్తి, గంగరాజు, ప్రతిభ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి, బహుజనుల హక్కుల సాధనకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. చిట్టెమ్మ, షబానా, చైత్ర, శ్రీనివాసులు, శివప్రకాష్, గంగులప్ప, సీతారామయ్య పాల్గొన్నారు.

## రూ.15వేలు పింఛన్ ఇవ్వాలి


సురేష్‌బాబును పరామర్శిస్తున్న ఇర్షాద్

రొంపిచెర్ల: అర్హులైన దివ్యాంగులకు రూ.15 వేలు పింఛన్లు ప్రభుత్వం ఇవ్వాలని చిత్తూరు జిల్లా దివ్యాంగుల సంఘం ఉపాధ్యక్షుడు ఇర్షాద్ అన్నారు. ఆయన ఆదివారం పాళ్యెం వీధిలో గత ఐదేళ్లుగా మంచానికే పరిమితమైన దివ్యాంగుడు సురేష్‌బాబును ఆయన పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం లారీలో కూలీ పనిచేస్తుండగా జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మంచానికే పరిమితం అయ్యారని తెలిపారు. అయితే అధికారులు 40 శాతం మాత్రమే వికలత్వం ఉందని సదరంలో సర్టిఫికెట్ ఇచ్చారని తెలిపారు. అయితే ఇంతవరకు తనకు ఎలాంటి పింఛన్ మంజూరు కాలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంచానికే పరిమితమైన రోగులకు రూ.15 వేలు పింఛన్ ఇస్తుందని హామీ ఇచ్చారన్నారు. సురేష్‌బాబుకు ఎలాంటి పింఛన్ అందక కుటుంబం తీవ్ర ఇబ్బందులకు గురవుతోందన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని సురేష్‌బాబుకు అంత్యోదయ బియ్యం కార్డు ఇచ్చి, రూ.15వేలు పింఛన్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నేతలు మహ్మదాలీ, ఆనందరాజు, అబ్దుల్ రహమాన్, దిలీప్, అనీఫ్ పాల్గొన్నారు.

## క్రీడల్లో సత్తా చాటిన కార్తీక్‌కు అభినందన


కార్తీక్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

చౌడేపల్లె: జోనల్స్ క్రీడల్లో సత్తాచాటిన చౌడేపల్లె మండలం కాగతి పంచాయతీ చిన్న ఓబునపల్లెకు చెందిన కార్తీక్‌ను చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ప్రశంసించి గోల్డ్‌మెడల్‌ను అందజేశారు. ఆదివారం రచయితల సంఘం, ఎంబీ కేశవరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో చిత్తూరులో జరిగిన సంక్రాంతి సంబరాల్లో కార్తీక్‌కు ఎమ్మెల్యే పురస్కారం అందించారు. ఇతను కుప్పం ప్రభుత్వ పాలటెక్నిక్ కళాశాలలో ఈసీఈ రెండవ సంవత్సరం చదువుతూ జోనల్ క్రీడలు 1500 మీటర్ల పరుగుపందెం, షాట్‌పుట్‌లో సత్తా చాటి ప్రతిభ చూపడంతో ఎమ్మెల్యే అభినందించి, మెడల్స్‌తో సత్కరించారు. కార్తీక్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

### గడ్డివామి దగ్ధం


మంటలను అదుపుచేస్తున్న స్థానికులు

చౌడేపల్లె: మండలంలోని గడ్డంవారిపల్లె పంచాయతీ చౌడగానిపల్లెలో గడ్డివామి దగ్ధమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. కల్యాణికి చెందిన గడ్డివామికి మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు మంటలను అదుపుచేస్తూ పుంగనూరు ఫైర్ సిబ్బందికి సమాచారమిచ్చారు. ఘటనలో రూ.30 వేల విలువచేసే గడ్డి దగ్ధమైనట్లు బాధితురాలు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరింది.

### బీసీ మహిళా ప్రధాన కార్యదర్శిగా హేమావతి


నియామకపత్రం అందుకుంటున్న హేమావతి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శిగా హేమావతిని నియమిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ప్రకటించారు. చిత్తూరు నగరంలోని బీసీ సంక్షేమ కార్యాలయంలో ఆదివారం ఇంచార్జ్ షణ్ముగం ఆ నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు నాగేంద్ర, గిరిజ, రమా, ప్రియ, సెల్వి, హర్షవర్దన్, హరిగణేష్ పాల్గొన్నారు.


పూర్వ విద్యార్థులు

## పూర్వ విద్యార్థుల కలయిక

రామకుప్పం: మండలంలోని చెల్దిగానిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. 1994–95 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన వీరు 30 ఏళ్ల తర్వాత మళ్లీ ఒకచోట కలిశారు. పరస్పర పరిచయాలు, ఆటపాటలతో బాల్యాన్ని గుర్తుచేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని నిర్ణయించారు. పాఠశాలలో స్థానికంగా ఉన్న అవసరాలను గుర్తించి దాన్ని తీర్చేందుకు పాఠశాల విద్యా కమిటీ మాజీ చైర్మన్ వై.జయరామిరెడ్డి, ప్రస్తుత చైర్మన్ జయచంద్ర సారథ్యంలో ఒక కమిటీని ఏర్పాటుచేసుకున్నారు.

## కమనీయం.. కల్యాణం


వరసిద్ధుని కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రామకుప్పం: దేవదాయ–ధర్మాదాయశాఖ, కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం ఆధ్వర్యంలో శనివారం రాత్రి రామకుప్పంలోని శివాజీనగర్ కాలనీలో కాణిపాక వినాయకస్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. హిందూ ధర్మప్రచార నిమిత్తం కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ప్రచార రథంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను అధిష్ఠింపజేసి ధర్మప్రచార రథాన్ని గ్రామాల్లో ఊరేగిస్తూ దళితవాడల్లో స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అందులోభాగంగా నిర్దేశించిన దళితవాడల్లో స్వామివారి కల్యాణోత్సం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాణిపాక ఆలయ జూనియర్ అసిస్టెంట్ హరి, అర్చకులు ఉన్నికృష్ణన్ పాల్గొన్నారు.

### ఫిబ్రవరిలో నాక్ బృందం సందర్శన

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఫిబ్రవరి 13, 14వ తేదీల్లో నాక్ బృందం సందర్శించనుంది. ఎంతో చరిత్ర కలిగిన పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 2017 మార్చి 28 నాక్ – ఏ గ్రేడ్ లభించింది. ఆ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్ లభించిన అనంతరం ఎంతో అభివృద్ధి చెందింది. నిబంధనల మేరకు మరోసారి నాక్ బృందం ఫిబ్రవరి 13, 14వ తేదీల్లో కళాశాలను సందర్శించి గ్రేడ్ ఇవ్వనుంది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను ఆ కళాశాల ప్రిన్సిపల్ జీవనజ్యోతి పర్యవేక్షణలో పకడ్బందీగా నిర్వహిస్తున్నారు.

## బదిలీల్లో పెర్ఫార్మెన్స్ పాయింట్ల విధానం వద్దు

చిత్తూరు కలెక్టరేట్: బదిలీల చట్టంలో టీచర్లకు పెర్ఫార్మెన్స్ పాయింట్ల విధానం వద్దు అని ఆపస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న బదిలీల పెర్ఫార్మెన్స్ పాయింట్ల విధానంతో టీచర్లకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఈ విధానం అమలు చేస్తే పైరవీలకు అవకాశం ఏర్పడుతుందన్నారు. సదరు పాయింట్లతో గతంలో దుర్వినియోగం జరిగిందని గుర్తు చేశారు. కేవలం సర్వీస్, పాఠశాల స్థాయి పాయింట్లు, ప్రిఫరెన్షియల్ పాయింట్లతో మాత్రమే బదిలీల చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

## ఎమ్మార్పీఎస్ నేతకు నివాళి


వరదరాజుల భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర నేతలు

కాణిపాకం(యాదమరి): దళితరత్న అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు వరదరాజులు శనివారం తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో ఆకస్మికంగా మృతిచెందాడు. ఆదివారం యాదమరి మండలంలోని తెల్లరాళ్లపల్లెలో వరదరాజులు మృతదేహానికి రాష్ట్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు, కర్ణాటక రాష్ట్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఓబుల్‌క్రిష్ణ, ఏపీ గౌరవాధ్యక్షుడు వెంకటేష్, రాష్ట్ర, జిల్లా నేతలు శేఖర్, శ్రీనివాసులు, గురుశంకర్, జిల్లా చర్మకారుల సంఘం అధ్యక్షుడు రమేష్, చెంగయ్య, నేతలు నివాళులర్పించారు.

# సంప్రదాయ పంట అనప


పట్టణంలో విక్రయానికి ఉంచిన అనపకాయలు


అనప పప్పు


సాగులో అనప పంట(ఫైల్)

వి.కోట: శీతాకాలం వచ్చింది అనపకాయలు పంట సీజన్ ప్రారంభమైంది. అనపకాయల సీజన్ ప్రారంభం కావడంతో ఏ ఇంట్లో చూసినా అనపకాయల పులుసులే ఘుమఘుమ లాడుతున్నాయి. అనపకాయలను సాధారణంగా సంక్రాంతి కాయలని కూడా అంటారు. అనపకు రాయలసీమలో ప్రత్యేకత ఉంది. ముఖ్యంగా రాయలసీమలో రైతులకు ఇది సంప్రదాయ పంటగా పండిస్తారు. మండలంలో 75 ఎకరాల్లో అనపను అంతర్ పంటగా రైతులు సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈ పంటను సాధారణంగా వేరుశనగ పంటలో అంతర్ పంటలుగా సాగు చేస్తారు. ఇది అంతర్ పంటగా అనపను సాగు చేయడంతో రైతులకు పెట్టుబడి ఖర్చులు లేకపోవడంతో రైతులకు ఈ పంట ఆర్థికంగా ఆదుకుంటుందనే చెప్పవచ్చు. పలమనేరు, వి.కోట, కుప్పం ప్రాంతాల ప్రజలు వీటిని నిత్యం వంటకాల్లో ఈ సీజన్‌లో వాడతారు. దీంతో స్థానిక రైతులు అనప పంటకు ఎక్కువగా ప్రాధాన్యతినిస్తుంటారు. ఇక్కడి రైతులు అనపను తిరుపతి, బెంగళూరు, క్రిష్ణగిరి, గుడియాత్తం వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. డిసెంబర్, జనవరి నెలల్లో వీటి రుచి మరింత పెరుగుతుందని పెద్దల నానుడి. ముఖ్యంగా బ్రాహ్మణులు, వైశ్యులు దీన్ని ఎక్కువగా ఇష్టపడుతూ మూడు నెలలవరకూ అనపతో రకరకాల వంటలు చేసి భుజిస్తుంటారు. ప్రస్తుతానికి మార్కెట్‌లో వీటి ధర రూ.70 నుంచి రూ.100 వరకూ పలుకుతోంది. దీన్ని సంక్రాంతి రోజున అనపకాయలతో పిఠికిపప్పును చేసి సంప్రదాయ వంటగా వాడతారు. దీంతో సంక్రాతి పండుగకు వీటి ధర మరింత పెరిగే అవగాశం ఉన్నట్లు వ్యాపారస్తులు చెబుతున్నారు.

### విద్యుత్ బిల్లులను తగలబెట్టండి


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో దహనం చేసే కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు తెలిపారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అదనపు విద్యుత్ భారాలను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. 2026 జనవరి వరకు సర్దుబాటు భారం తప్పదని గతంలో ప్రభుత్వం తెలిపిందన్నారు. కానీ ఇటీవల విద్యుత్ భారం వినియోగదారులపై వేయకుండా సర్కార్ ఎత్తువేస్తున్నట్లు ప్రకటించిందన్నారు. అది ఎప్పటి నుంచి అమలు అవుతుందో తెలపాలన్నారు. రోజువారీ విద్యుత్ వాడకంలో మార్పులు చేయరాదన్నారు. టైం ఆఫ్ డే విధానాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. 24 గంటలను పీక్ అవర్స్, హాఫ్ పీక్ అవర్స్, నార్మల్ అవర్స్ కింద విభజించాలనే ప్రయత్నాన్ని విరమించాలన్నారు. స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేయరాదన్నారు. ఇందుకు నిరసనగా విద్యుత్ బిల్లులు తగలబెట్టే కార్యక్రమంలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని వివరించారు.